# సగం ప్రజాస్వామ్యం

'నా ఓటు నేను వేసి తీరాలి!'

'వేయండి!'

'నాకు పోస్టల్ బేలెట్ ఇవ్వాలి!'

'ఇవ్వటానికి వీలులేదు'

ఈ సంభాషణ రవికీ, అనంతపురం పార్లమెంటరీ నియోజకవర్గం ఎన్నికల అధికారికీ మధ్య జరిగింది.

ఓటు హక్కు కాదు, బాధ్యత. పవిత్రమైన రాజ్యాంగ బద్ధమైన, నైతికమైన ధార్మికమైన బాధ్యత.

ఇది రవి విశ్వాసం.

రాష్ట్రపతి జాతి ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఈ మాటలే చెప్పాడు.

రవికూడా, తన విద్యార్థులకు, బంధుమిత్రులకు, కుటుంబ సభ్యులకు ఈ మాటే ఏభై ఏళ్ళుగా చెబుతూ వచ్చాడు. చెప్పటమేకాదు, ఆచరించేవాడు. ఆచరింపచేసేవాడు. భార్యనూ, పిల్లలనూ వెంటతీసుకొని పోయి తాను ఓటు వేసి, వాళ్ళు తమబాధ్యత నెరవేర్చగా ఇంటికి తీసుకువచ్చేవాడు. పిల్లలు పెళ్ళిళ్ళయి, ఉద్యోగాలు వచ్చి వేరే ఊళ్ళు వెళ్ళిపోయినా, ఎన్నికలకు ముందురోజు ఫోన్లు చేసి ఓటు వేయటం మరిచిపోవద్దని చెప్పటం ఆనవాయితీ చేసుకొన్నారు.

తనకు ఎలెక్షన్ డ్యూటీ ఉంటే పోస్టల్ బేలెట్ తీసుకొని ఓటువేసి తీరేవాడు. అటువంటిది ఇప్పుడు పోస్టల్ బేలెట్ ఇచ్చే అవకాశం లేదంటున్నాడు అధికారి. ఇవ్వాలని పట్టుదలగా అడుగుతున్నాడు రవి.

రవి వి.సి.గా పదవీ విరమణ చేశాడు. బాధ్యత తెలిసిన మనిషి. అనంతపురంలో అసెంబ్లీ పార్లమెంటు ఎన్నిక జరుగుతున్న రోజే, న్యూఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విదేశాంగ శాఖ సలహా మండలి సమావేశం ఉంది. అది ఎన్నికల తేదీ ప్రకటించకముందే నిర్ణయింప బడింది. ఆ మీటింగులో పాల్గొంటానని తాను అంగీకారం తెలిపాడు. ఇప్పుడీ ఎన్నికలు వచ్చాయి.

అనంతపురంలో ఉదయమే ఓటు వేసినా, పదకొండు గంటలకు న్యూఢిల్లీలో సమావేశానికి హాజరు కాలేడు. ఏ ప్రయాణమూ వీలుకాదు. పదిమంది సభ్యులతో పనికాబట్టి, అది తేదీ మారదు. ఎన్నికల తేదీ మారదు. ఓటు బాధ్యత నిర్వహింపదలిస్తే, కమిటీ బాధ్యత నిర్వహించలేడు. దాని ప్రాధాన్యం దానికుంది.

ఇంతమంది ఓటు బాధ్యత నిర్వహిస్తారు కాబట్టి తాను ఓటు వేయకపోయినా ఫరవాలేదని రవి అనుకోలేడు.

కమిటీ మిగతా సభ్యులు నిర్ణయం తీసుకొంటారు లెమ్మని, తాను, తన సూచనలు చెప్పకపోయినా జరిగి పోతుంది తెమ్మని ఊరుకోలేడు.

అందుకోసం పోస్టల్ బేలెట్ అడిగాడు. అది ఇస్తే ఓటూ వేయవచ్చు. సమావేశంలో పాల్గొననూ వచ్చు. రెండు బాధ్యతలు నిర్వహించవచ్చు.

ఎలెక్షన్ డ్యూటీ ఉన్న ఉద్యోగులకు మాత్రమే పోస్టల్ బేలెట్ ఇస్తారు కానీ, మరెవ్వరికీ ఆ అవకాశం లేదు.

ఇప్పుడు రవి ఉద్యోగి కాకపోయినా, ఎలెక్షన్ డ్యూటీకంటే పెద్ద బాధ్యత నెరవేరుస్తున్నాడు, కాబట్టి పోస్టల్ బేలెట్ కావాలంటున్నాడు.

ఎన్నికల అధికారి, తన పరిధి వివరించి, తన నిర్ణయం ప్రత్యేకంగా ఉండదని, తన ప్రమేయానికి అవకాశం లేదని స్పష్టం చేశాడు.

ఈ పరిస్థితుల్లో ఈ రెండింటిలో ఏ ఒక్కటో చేయగలడు రవి. రెండూ చేయటం సాధ్యం కాదు.

ఓటు వేయటమా, మీటింగుకు హాజరు కావటమా? ఏదో ఒకటి నిర్ణయించుకోవాలి. పోస్టల్ బేలెట్ ఉంటే రెండూ సాధ్యమే! లేకపోతే ఏదో ఒకటే సాధ్యం.

ఏదో ఒకటి అనుకొంటే ఆలోచనే అవసరం లేదు. ఆరాటమూ అక్కరలేదు. తాపత్రయమూ లేదు. రవి మనస్సు చికాకుగా ఉంది. అయినా ప్రయత్నం మానలేదు.

జిల్లా ఎన్నికల ప్రధాన అధికారి కలెక్టరు. కలెక్టరు ప్రమేయంతో తాను ఓటువేసే పరిస్థితి ఉంటుందేమో నని ప్రయత్నించటంలో భాగంగా రవి కలెక్టరుకు ఫోను చేశాడు.

రోజంతా పనిలో తలమునకలయి, అలిసి ఉన్న కలెక్టరు చెప్పిన మాట శ్రద్ధగా వింది. ఓర్పుగా ఆలోచించింది.

'ఈ రెండు బాధ్యతల్ని నేను హక్కులుగా భావిస్తున్నాను. ఏ హక్కునూ వదులుకోదలచలేదు. అవకాశం పరిశీలించండి' అని రవి కోరాడు.

'పౌరధర్మం నిర్వహించటానికి, దేశావసరం తీర్చటానికి సంసిద్ధులైన మిమ్మల్ని హృదయ పూర్వకంగా అభినందిస్తున్నాను' అంది కలెక్టరు.

జిల్లా కలెక్టర్లు స్త్రీలు అయితే పరిపాలన ఎంత ఓర్పుగానో ఆదరంగానో ఉంటుందని రవి భావించాడు.

'మీరు అన్నీ తెలిసిన పెద్దలు' అంది. ఆగింది. 'కొన్ని నియమాలకు లోబడి మేము పనిచేయవలసి ఉంటుందనీ మీకు తెలుసు.' ఆగింది. దగ్గింది. 'నేనేమీ చేయలేను. మీరే మీ నిర్ణయం తీసుకోవాలి. అది కష్టంగానే ఉంటుంది. ఏదో ఒకటే మీరు చేయగలరు. పోస్టల్ బేలెట్. ఎలక్షన్ డ్యూటీ ఉన్న ఉద్యోగులకు తప్ప మరెవ్వరికీ ఇచ్చే అవకాశం లేదు. రాష్ట్రపతి అయినా బూత్‌కు వచ్చి ఓటు వేయవలసిందే. పోస్టల్ బేలెట్ లేదు. సెక్యూరిటీ ప్రమాదమున్నా ప్రధానమంత్రి అయినా బూత్‌కు వచ్చి ఓటు వేయవలసిందే! వాళ్ళకూ ఎన్నో పనులు ఉంటాయి కదా, అయినా పోస్టల్ బేలెట్ వాళ్ళకు కూడా ఇచ్చే వీలులేదు. మీకు తెలియంది ఏముంది? నేనేం చేయలేను'

రవి ఆమె నియమ పాలన దృష్టిని అంగీకరిస్తూ 'ఉన్న స్థితిని కాదు, ఉండవలసిన స్థితిని గురించి నేనడుగుతున్నాను. రెండు బాధ్యతలు నిర్వహించే అవకాశం నాకు కలిగించే పరిస్థితిని గూర్చి ఆలోచించమనటానికి ఫోను చేశాను!'

'మీకు తెలుసు. నేనేమీ చేయలేను'

'సరే! మీరు రోజంతా పనిచేసి అలసిపోయి కూడా నా అవసరం గూర్చి ఆలోచించి, ఓర్పుగానూ, నేర్పుగానూ బదులు చెప్పినందుకు థాంక్స్!' అంటే 'మీకే థాంక్స్ చెప్పాలి సార్ నేను. ఇటువంటి పరిస్థితుల్లో ఏంచెయ్యాలి అని ఆలోచించి ప్రభుత్వానికి వ్రాసి, పరిశీలించి, తగు నిర్ణయం తీసుకోమని, చెప్పే అవకాశం మీరు నాకు ఇచ్చినందుకు మీకు థాంక్స్!' అంది.

రవి ఆలోచన అంతటితో ఆగలేదు.

భర్తతో మాత్రమే బైటికి వచ్చే స్త్రీ, భర్త లేకుండా పోలింగు బూతుకు వచ్చి ఓటు వేయాలి.

పచ్చి బాలింతరాలు, పండు ముసలి, అంగవికలురు, కాటికి కాళ్ళు చాపినవాళ్ళు అయినా ఓటు వేయాలంటే పోలింగు బూతుకు రావాలి.

మార్గాంతరం లేదా? ప్రత్యామ్నాయం లేదా?

రవి అశాంతిగా ఉన్నాడు.

పెళ్ళి, చావు, పితృకర్మ, అనారోగ్యం, డెలివరీ, హాస్పిటల్ వైద్యం, ఆపరేషన్, పరీక్ష, దూరనివాసం వంటి సవాలక్ష సందర్భాలలో ఓటువేసే అవకాశం లేకపోవటంవల్ల ఓట్లు మురిగిపోవాలా?

తెలిసి వచ్చే తొందరలు, తెలియకవచ్చే ఆటంకాలు ఈ బాధ్యతను నిర్వీర్యం చేస్తాయా? మరో మార్గం ఉండవద్దా?

ఏ కారణాలవల్లనయినా పోలింగు బూతుకు వచ్చి ఓటు వేయలేకపోయేవాళ్ళు. ఓటు వేసే బాధ్యత నిర్వహించటానికి ఏదో ఏర్పాటు ఉండి తీరాలి.

ఇంతవరకు ఆ ఏర్పాటు లేదు. ఇకముందు కూడా ఆ ఏర్పాటు లేకుండా పోకూడదు.

ఓటర్ల లిష్టులో పేర్లున్నవాళ్ళు, అర్హులైన అందరిపేర్లు లిష్టుల్లోకి రావాలి, చనిపోయిన వాళ్ళు మినహా, అందరూ ఓట్లు వేసే వ్యవస్థ ఏర్పడాలి. నూటికి యాభై ఓట్లే పోలుకావటం కాదు, నూరుశాతం పోలుకావాలి.

మీరు ఓట్లు వేస్తే ఎంత, వేయకపోతే ఎంత అనే దృష్టి ప్రజలకు, నాయకులకు, ప్రభుత్వాలకు ఉండకూడదు.

ఇరవైశాతం ఓట్లు పోలయినా ఫరవాలేదు. మెజారిటీ వచ్చిన వాడు గెలుస్తాడు అనే నిర్లక్ష్యం ఉండరాదు.

అందరి ఓట్లు పోలుకావాలని ఆశ ఆసక్తి ఉండి తీరాలి.

పోలింగు బూతును మించిన పోలింగు విధానం ఏర్పటం ప్రజాస్వామ్యం దృష్టితో అనివార్యం.

ఈ దృష్టితోనే రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని రవి కలిశాడు.

అధికారి అలిసిపోయి ఉన్నాడు. రవి రావటం అలుపు తీర్చుకొనే మార్గంగా భావించాడు.

'అందరూ ఓట్లు వేసే అవకాశం ఉండాలి. నేను నా ఓటు వేయాలి.'

'వీలు లేదుకదా, ఫరవాలేదు మాష్టారూ, ఎవరో ఒకరు వేస్తారు!'

రవికి బాధ కలిగింది. 'దొంగ ఓటా?'

'పోనీలేద్దురు! సద్వినియోగం అవుతుంది కదా!'

'సద్వినియోగమా? కాదుకదా! దుర్వినియోగం. నా ఓటు మరొకరు వేయటం మోసం నేరం.'

'నిజమే. జరుగుతున్నదదే ఏం చేస్తాం? మీ ఓటు మురిగిపోదు లెండి!'

'మురిగిపోయినా మేలే! నేను వేయదలచిన కాండిడేట్‌కే నా ఓటు పడుతుందన్న గేరంటి ఏమీ ఉండదు. కాకుండా మరొకరికి ఓటు పడేకంటే మురిగిపోవటం మేలే! కానీ ఓటు మురిగిపోవటం నాకిష్టంలేదు. పైగా అక్రమం జరుగుతుందని మీరు అంగీకరించటం నాకు బాధగా ఉంది.'

'నిజమే, సరదాకి అంటున్నాను కానీ, మాష్టారూ, మీకు, మీవంటి ఓటర్లకు, చాలా సందర్భాలలో, అవసరాలలో, పోస్టల్ బేలెట్‌లు ఇస్తే సద్వినియోగం అవుతాయా? దుర్వినియోగం కావా?'

'దుర్వినియోగమంటే?'

'ఏవో ప్రలోభాలకు లొంగి కొనే అభ్యర్థికి ఓటు అమ్మేయటం జరగదా?'

చాలా బాధతో 'నేను నా ఓటు అమ్ముకొంటానని మీరు భావిస్తున్నారా?' అన్నాడు రవి.

'మీ విషయం కాదు మాష్టారూ, ఎవరైనా తను ఓటు అమ్ముకోవచ్చుకదా!'

'నిజమే! ఓటు అమ్మటం తప్పే! కొనటమూ తప్పే! ఎవరికీ శిక్ష లేదు'.

'కానీ బాహాటంగా కొనుగోళ్ళు అమ్మకాలు జరగవు కదా! అంతా లోపాయికారీ వ్యవహారం. డబ్బు తీసుకొని ఓటరు తన ఓటు వేరే అభ్యర్థికి వేసే అవకాశం ఉంది. పోస్టల్ బేలెట్‌లో ఆ ఆశకాశం లేదు. పోస్టల్ బేలెట్ అమ్ముకోవటం విన్నారు కదా!'

'చదివాను!'

'ఇటువంటి సందర్భాలలో పోస్టల్ బేలెట్ అనైతిక చర్యను ప్రోత్సహించటమేకదా!'

'అందరూ అమ్ముకోరు!'

అధికారి బాధ్యతా యుతంగా ఉన్నాడని రవి ఆనందించాడు.

'ఎవరు ఓటు అమ్ముకొంటారో, ఎవరు కొంటారో, ఎలా తెలుస్తుంది? తెలిస్తే మాత్రం ఏంచేయటం?'

'ఓట్ల వ్యాపారం మొదలైతే ఏ ఓటు అయినా అమ్ముడు పోతుంది. అమ్మటమే నేరం. ఓటు అమ్మేది ఒకరికి, వేసేది మరొకరికి, అయితే మరో ద్రోహం. నేరమే అసహ్యం. ద్రోహం నైతిక పతనం, నేరమూ ప్రోత్సహించరాదు. ద్రోహమూ సహించరాదు.

'పోస్టల్ బేలెట్ దగ్గరుంటే అమ్మకపోతే, దొంగతనం జరగవచ్చు. మానభంగం కావచ్చు. ప్రాణహాని కలగవచ్చు'

'అది ఊహ మాత్రమే! కానీ అవకాశం లేకపోలేదు. నీతిమంతులకు, అవినీతి పరులకు పోలింగు బూతే మేలంటారు?'

'కాదామరి? మంచో చెడో, తప్పో ఒప్పో పోలింగు బూతుతో చెల్లు! కొత్తచెత్త నెత్తికెత్తుకొనే పనిలేదు.'

'అంటే మీరు పాత దుర్వినియోగం కొనసాగిస్తూ కొత్త దుర్వినియోగం నివారిస్తామంటారు? అంతేనా?'

'కొత్త సమస్యలు వద్దుకదా!'

'తాగించి ఓట్లు కొంటున్నారు. గుడి, బడి, రోడ్డు, నీళ్ళటాంకులకు డబ్బు ఇచ్చి పల్లె ఓట్లు ఊరి ఓట్లు కొంటున్నారు, బొట్టుకాటుక, చీరె జాకెట్టు, బిందె బక్కెట్టు ఏవేవో ఇచ్చి ఓట్లు కొంటున్నారు. ఇళ్ళస్థలమోఇల్లో, గొర్రో, బర్రో ఇస్తున్నారు. ఓట్లు కొంటున్నారు. భూమీ పుట్రా, తాగునీరు, సాగునీరు దిక్కుమాలినన్ని దిగాళాకోరుపనులు చేస్తున్నారు. ఇవేవీ నేరాలు కావా? దేశద్రోహం కాదా? వీళ్ళు దేశద్రోహులు కారా? దేశ ద్రోహుల్ని ఎన్నుకోనిస్తారా? దేశద్రోహులు నాయకులై దేశాన్ని పరిపాలించాలా? దేశాన్ని ఆయకంపెట్టాలా? అమ్ముకుతినాలా? దేన్ని మనం ప్రోత్సహిస్తున్నాం?

'ఇవి అరికట్టవలసినవే'

'ఇన్ని ఘోరాలమధ్య సగం మందే ఓట్లు వేస్తున్నారు. అందరూ ఓట్లు వేసే అవకాశం మంచిది'

'తలనొప్పులు పెరుగుతాయి!'

'తలనొప్పులు వస్తున్నాయని ఎన్నికలు ఆపలేంకదా, ఆపరాదుకదా! అలాగ్గే ఎన్ని తలనొప్పులయినా భరించి నూటికి నూరుశాతం ఓట్లు పోలయ్యేట్టు చూడటం శ్రేయంకదా!'

'మంచిదేకాని- అసాధ్యం!'

'పూర్తి శాతం జనం ఓట్లు వేయటానికి ఎన్ని ఏర్పాట్లు అయినా చేయవచ్చు. ఎంత ఖర్చయినా పెట్టవచ్చు. ఎంత మందీ మార్బలం అయినా నియమించవచ్చు. అందరూ ఓట్లు వేసే పరిస్థితి ఉంటే అవినీతి తగ్గుతుంది.'

'కాదు! పెరుగుతుంది!'

'ప్రయత్నించకుండానే పెరుగుతుందంటే బాధ్యతా రాహిత్యమే. అలా అనకూడదు.'

'పోలింగు బూత్‌లో జరిగే ప్రమాదమే పోస్టల్ బేలెట్‌లోనూ జరుగుతుంది.'

'కావచ్చు. అక్కడ యాభైమంది ఓటు వేయగా, ఇక్కడ నూరుమంది దాకా ఓటువేస్తారు.'

'మంచో, చెడో, కీడో, మేలో, రెట్టింపు అవుతుంది.'

'ఏ సందర్భంలో నైనా, ఏ పరిస్థితుల్లోనైనా ఓటరు తన ఓటు బాధ్యత నిర్వహించే అవకాశం ఉండాలి.'

'మేలే!' అధికారి అంగీకరించాడు.

అటెండరు కాఫీ రెండు కప్పుల్లో తెచ్చాడు. 'బుర్రవేడెక్కింది మాష్టారు!' అంటూ అధికారి కాఫీ చప్పరిస్తున్నాడు. రవి మంచినీళ్ళు తాగాడు.

'కొందరి ఓట్లు కొంటారు. కొందరిని ఓట్లు వేయటానికి రానీరు. కొడతారు, చంపుతారు. కొందరికి ఓట్లు లేకుండా చేస్తారు. ఎదురు మాట్లాడితే మాన ప్రాణ హాని తలపెడతారు. ఆస్తులు నాశనం చేస్తారు. ఇన్ని ప్రలోభాల మధ్య, అందంకూడా ప్రవేశించింది. అందగాళ్ళను, అందగత్తెలను, సినీ మాయాలోకం నుంచి దించుతున్నారు. ఆకర్షణ ప్రలోభం ప్రవేశించింది. నిశ్శబ్ద ప్రచారం ఉండదా? శబ్దకాలుష్యం తగ్గదా? ధన దౌర్జన్యం పోదా? కులం మతం కుళ్ళు కంపు పోవా? కొట్లాటలు, హింసలు, మానభంగాలు, ప్రాణహానులు ఆగవా? దుర్మార్గులు రాజ్యమేలాలా? దుర్మార్గులు రాజ్యం పంచుకోవాలా? దుర్మార్గులుగా జనం మారాలా? దుర్మార్గంలో ప్రజాజీవనం కొనసాగాలా?'

'మాష్టారూ! నన్ను మన్నించాలి. నేను వీటికి వేటికీ బదులు చెప్పలేను, కానీ ఒక్కటి మాత్రం చెప్పగలను! ఓటరు స్థాయి పెరగాలి.'

'ఓటరుస్థాయి పెరగాలంటే ఆర్థిక దుస్థితి తొలగాలి. తొలగనివ్వం. వాళ్ళకు ఏమీ లేకుండా ఉండాలి. అన్నం, బట్ట, గుడిసె ఇస్తూనే ఉండాలి. కొరత తీరకూడదు. కులం, మతం, బ్రాందీ, గుడి మత్తు ఎక్కిస్తూనే ఉండాలి. వాళ్ళా మత్తులో పడి కొట్టుకొంటూ ఉండాలి. నీళ్ళు డబ్బు ఖర్చు చేసి గెలవాలి. దానికి పదిరెట్లు సంపాదించాలి. దేశాన్ని దోచుకోవాలి. అమ్ముకోవాలి. జనం ఏమనుకొంటారన్న సిగ్గు లేకుండా డబ్బు సంపాదించాలి. అందులో పదోవంతు ఖర్చుచేసి మళ్ళీ గెలవాలి. మళ్ళీ దోపిడీ! ప్రజల్ని చైతన్యవంతుల్ని కానిచ్చే పరిస్థితే లేదు. దారిద్ర్యం తొలిగే స్థితీ లేదు. ఓటరు స్థాయి పెరక్కుండా ఎంత జాగ్రత్త పడాలో అంత జాగ్రత్తా పడతారు వీళ్ళు. ఇన్ని ప్రజాప్రభుత్వాలు. ఇన్ని ప్రణాళికలు. ఇన్ని ప్రభుత్వాలు ఏంచేశాయి? పేదలు నిరుపేదలుగా మారుతున్నారు. పేదరికం నిర్మూలించే ప్రజాస్వామ్యం రావాలి.'

'ప్రజాస్వామ్యం, పేదరికం ఒకదాని పునాదిమీద మరొకటి మొలుస్తున్నాయి. ప్రజాస్వామ్యం పేదరికాన్ని నిర్మూలిస్తుందా? నిర్మూలింపబడ్డ పేదరికం-సర్వ సమాన సంపన్న జనం-సక్రమ ప్రజాస్వామ్యం నెలకొల్పుతారా? ఏది ముందు? ఏది వెనక? ఏది సాధ్యం? ఏది అసాధ్యం? మాష్టారూ! ఏదీ ఆలోచనకు అందటం లేదు.'

' ఈ ప్రజాస్వామ్యం ఎన్నికల్లో సగం ఓట్లే పోలవుతున్నాయి. మిగతా సగం వ్యర్థం. ఇక ప్రజాస్వామ్యం సంపూర్ణంగా సంక్షేమంగా, సర్వసమర్థంగా ఎప్పుడు రూపొందుతుంది?'

అధికారి తలపట్టుకొని కూర్చున్నాడు.

'ఈ సగం ఓట్లలో బహుముఖ పోటీ వల్ల సగంకూడా రానివాడు గెలుస్తాడు. అటువంటి వాళ్ళు కొందరు కలిసి పరిపాలిస్తారు. కొందరు ప్రతిపక్షం అవుతారు. నూటికి పదీ పాతికమందికి

కూడా ప్రాతినిధ్యం వహించలేని వాళ్ళు పాలకులవుతున్నారు. ఎంత దుర్మార్గం?'

'ఇది ప్రజాస్వామ్యం మాష్టారూ!'

'ఈ ప్రజాస్వామ్యం పకడ్బందీగా రూపొందాలి'

'అంటే?'

'వీలయినంత ఎక్కువ మంది ఓటును బాధ్యతగా, హక్కులాగా వినియోగించుకొనే పరిస్థితి ఉండాలి.'

'అంటే విరివిగా పోస్టల్ బేలెట్‌లు ఇచ్చే పరిస్థితి ఉండాలంటారు? అంతేనా?'

'అంతే!'

'పైకి రాస్తాను!'

రవి పైకి లేచాడు.